
వనపర్తి ఆసుపత్రి ఆవరణలో రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పిల్లల ప్రత్యేక వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి


వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: జిల్లా ఆసుపత్రిలో పోషక పునరావాసం కేంద్రం ఏర్పాటు చేశామని జిల్లాలో ఎత్తుకు తగ్గ బరువు, వయసుకి తగ్గ ఎదుగుదల లేని పిల్లలు (స్వామ్, మ్యామ్) ఆరోగ్య పరిరక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం వనపర్తిలోని జీజీహెచ్, గోపాల్‌పేట రహదారిలోని ఎంసీహెచ్ ఆసుపత్రులను కలెక్టర్ తనిఖీ చేసి మాట్లాడారు. ఈ కేంద్రంలో ఐదు పడకలు ఏర్పాటు చేశామన్నారు. వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవడం, రక్తహీనత వంటి రుగ్మతలతో బాధపడుతున్న పిల్లలను ఎన్ఆర్‌సీ కేంద్రంలో చేర్పిస్తే ఉచిత పౌష్టికాహారం, నిపుణులైన వైద్యులతో వైద్య సేవలందుతాయన్నారు. ఎంసీహెచ్ ఆసుపత్రి సమీపంలో రహదారికి ఇరువైపుల అనుమతి లేకున్నా, రహదారిని ఆక్రమించి ఉన్న దుకాణాలను తొలగించాలని పుర కమిషనర్ పూర్ణచందర్‌కు ఆదేశించారు. తొలగించడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ రంగారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఇంటి నిర్మాణ గోడ కూల్చివేత

ఎంసీహెచ్ ఆసుపత్రి ముందు అనుమతి లేకున్నా నిర్మిస్తున్న ఇంటిని గోడలను పుర అధికారులు కూల్చివేశారు. ఇంటి నిర్మాణ యజమానులు గోడను కూల్చొదని అధికారులను వేడుకున్నారు. ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకున్న తరువాతనే పనులు చేపడుతామన్నారు. అనుమతి లేకుండా వేసిన డబ్బాలు, రహదారిని ఆక్రమించి వేసుకున్న డబ్బాలు తొలగించాలని పుర అధికారులు దుకాణాల యజమానులకు చెప్పారు. సామాను, డబ్బా సామగ్రి తొలగించేందుకు సమయం ఇవ్వాలని దుకాణాల యజమానులు కోరారు. పుర కమిషనర్ పూర్ణచందర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో డబ్బాలను స్వచ్ఛందంగా తొలగించాలని లేని పక్షంలో పురపాలిక నుంచి డబ్బాలను తొలగిస్తామన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి కరుణాకర్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల పరిరక్షణపై దృష్టేదీ..!

పాలమూరులో ఏడు వేల ఎకరాల్లో ఆక్రమణలు



ఈనాడు, మహబూబ్‌నగర్: పాలమూరులో వక్ఫ్ భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట పడటంలేదు. పూర్వ మహబూబ్‌నగర్‌లో 4,561 సంస్థలకు 11,500.18 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. వీటిలో సుమారు ఏడు వేల ఎకరాలకు పైగా భూములు అన్యాక్రాంతమైనట్లు గతంలోనే వక్ఫ్ బోర్డు గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో 1,592 చిల్లాలు, 1,523 అసూర్‌ఖానాలు, 766 ఖబర్‌స్థాన్‌లు, 297 మజీదులు, 223 దర్గాలు, 160 ఇతర సంస్థలకు ఈ భూముల కేటాయింపులు జరిగాయి. ప్రస్తుతం వీటిలో సగానికిపైగా భూములు వివిధ ప్రాంతాల్లో కబ్జాల్లో ఉన్నాయి. వీటి పరిరక్షణలో వక్ఫ్ బోర్డు ఉదాసీనత ప్రదర్శిస్తుండటంతో ఈ స్థలాల్లో స్థిరాస్తి వ్యాపారాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. పెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం వక్ఫ్ భూముల క్రయవిక్రయాలు చేయకూడదు. ఉమ్మడి జిల్లాలో ఇవేవీ అమలు కావడం లేదు. తరచూ ఏదో ఒక ప్రాంతంలో ఈ భూములపై వివాదాలు నెలకొంటున్నాయి.


మహబూబ్‌నగర్‌లో ఓ ప్రాంతంలో వక్ఫ్‌భూములు అంటూ ఏర్పాటు చేసిన బోర్డు

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి జిల్లాలో వక్ఫ్ భూములు పలు ప్రాంతాల్లో ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ముఖ్య ప్రజాప్రతినిధులు, స్థానిక నేతల సహకారంతో పలుచోట్ల ఈ భూములను రికార్డుల్లోనూ లేకుండా చేస్తున్నారు. భూములు కబ్జా అయినట్లు గుర్తించిన వక్ఫ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

- మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రెండు సర్వే నంబర్లలో 13 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి. మిగతా స్థలాల్లోనూ ఇతరుల కన్ను పడింది. తొలుత చిన్నపాటి షెడ్డులు వేసుకుని తర్వాత ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఇక్కడ ఎకరా విలువ సుమారు రూ.2 కోట్లకు పైగానే ఉంటుంది.
- నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో మొత్తం 460 ఎకరాల్లో వక్ఫ్ భూములున్నాయి. ఊట్కూరు, పులిమామిడి, కొల్లూరు, నిడుగుర్తి, పెద్దజట్రంలో ఈ భూములున్నాయి. కేవలం ఊట్కూర్‌లోనే 328 ఎకరాల్లో వక్ఫ్ స్థలాలుండగా ఇప్పటికే పలు భూములు అన్యాక్రాంతమైనట్లు సమాచారం. గతంలో ఈ భూములను కొందరు స్థిరాస్తి వ్యాపారికి విక్రయానికి పెట్టడం వివాదాస్పదమైంది. తర్వాత కూడా ఈ భూములను అధికారులు పట్టించుకోవడం మానేశారు.
- వనపర్తి జిల్లా అమరచింతలోని ఓ దర్గాకు వివిధ సర్వే నంబర్లలో 60 ఎకరాలకు పైగా స్థలాలున్నాయి. ఈ భూముల్లో సగానికి పైగా అన్యాక్రాంతమయ్యాయి. ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు విచారణ చేసినా ఫలితం లేకపోయింది.
- గద్వాల పట్టణంలోనూ వక్ఫ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టారని కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి విచారణ జరగలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలోనూ కొన్నిచోట్ల వక్ఫ్ స్థలాలు కనిపించడం లేదు.

పూర్తిస్థాయిలో సర్వే చేస్తే..

వక్ఫ్ భూములపై అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేయడం లేదు. సర్వే చేసి హద్దులు గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలి. వక్ఫ్ ఇన్‌స్పెక్టర్లు ఈ భూములపై నిరంతరం నిఘా పెట్టాల్సి ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అమలు కావడం లేదు. మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్(రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వక్ఫ్ భూముల పరిరక్షణ కోసం కమిటీల వివరాలు కావాలని ఇటీవలే ఉన్నతాధికారులు కోరారన్నారు. ఈ భూముల పరిరక్షణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 90శాతం భూములు గెజిట్‌లో ఉన్నాయని, వీటిని అన్యాక్రాంతం చేయడానికి వీలు లేదన్నారు.

దాతలిచ్చిన వాహనాలు నిరుపయోగం

- పెద్దమందడి మండలం మోజర్లకి చెందిన గోకరయ్య(50) ఆరోగ్యం బాగా లేదని కుటుంబ సభ్యులు ఇటీవల 108 వాహనానికి సమాచారమిచ్చారు. అంబులెన్స్ వనపర్తి నుంచి మోజర్లకు చేరేందుకు 45 నిమిషాలు పట్టింది. ఆ వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. సకాలంలో అతన్ని ఆసుపత్రికి తరలిస్తే వైద్యసేవలందేవి.
- ఖిల్లాగణపురానికి చెందిన సరిత ప్రసవం కోసం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. వైద్యులు ఆమెను పరీక్షించి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. సరిత కుటుంబసభ్యులు సుమారు గంటకుపైగా అంబులెన్స్‌కోసం ఎదురు చూశారు. వాహనం రావడంతో వనపర్తి ఆసుపత్రికి తరలించారు.



వనపర్తి జిల్లా ఆసుపత్రిలో ఉన్న ఖిల్లాగణపురం కేటాయించిన అంబులెన్స్ వాహనం

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రజలకు ఏదైనా ఆపదొస్తే వెంటనే 108 వాహనానికి సమాచారం ఇస్తారు. అది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను, బాధితులను సకాలంలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలను రక్షిస్తుంటాయి. అంబులెన్స్‌లు సకాలంలో చేరుకోలేకపోవడంతో గ్రామీణ ప్రాంత వాసులకు వైద్య సేవలందడం లేదనే విమర్శలు ఇటీవల ఎక్కువయ్యాయి. గర్భిణులు పురిటి నొప్పులతో బాధపడుతున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనం, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం : రోగులకు సకాలంలో వైద్య సేవలందించేందుకు జిల్లాలో 14 మండలాలకుగాను తొమ్మిది అంబులెన్స్‌లు ఉన్నాయి. ఖిల్లాగణపురం, పెద్దమందడి, శ్రీరంగాపూర్, చిన్నంబావి, వీపనగండ్ల మండలాలకు అంబులెన్స్‌లను ఏర్పాటు చేయలేదు. ఆయా మండలాల ప్రజలు ఆసుపత్రులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని కొందరు దాతలు, బ్యాంకర్లు ముందుకొచ్చి ఆయా మండలాలకు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. వీటిని 108 అంబులెన్స్‌గా మార్చి డ్రైవర్లను, డీజిల్, వాహన మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉంది. వైద్యారోగ్యశాఖ అధికారులు అంబులెన్స్‌లను 108 పరిధిలోకి మార్చాలని రెండేళ్ల క్రితం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో ఇవి ఆసుపత్రుల ఆవరణలోనే ఉన్నాయి. వాటిని వినియోగించుకోపోవడంతో తుప్పు పట్టే ప్రమాద ముంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దాతలిచ్చిన వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

> గతంలో ఆసుపత్రులకు దాతలిచ్చిన వాహనాలను 108 పరిధిలోకి మార్చాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అక్కడి నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వచ్చిన వెంటనే వాహనాలను వినియోగంలోకి తీసుకొస్తాం.
> –సాయినాథ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

జంగిల్ సఫారీని ప్రారంభించిన మంత్రి

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యంలోని జంగిల్ సఫారీని ఫర్హాబాద్ గేట్ వద్ద వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం పునఃప్రారంభించారు. 3 కొత్త పర్యాటక వాహనాలను అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నల్లమలలో పర్యాటకాభివృద్ధికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా అమ్రాబాద్ టైగర్ రిజర్వు ఫారెస్టును తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు. ఇక్కడి పర్యాటకాభివృద్ధితో చెంచు యువకులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు మన్ననూరులో ఎమ్మెల్యే, అటవీ శాఖాధికారులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్‌గోపిడి, ఎఫ్‌డీవో రామమూర్తి, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్‌డీవో రామ్మోహన్, ఎఫ్ఆర్వోలు దేవజ, డీఆర్వోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీవోలు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.


సఫారీని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, చిత్రంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా గోవర్ధన్


గోవర్ధన్

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పానగల్ మండలం మందాపూర్ గ్రామానికి చెందిన జి.గోవర్ధన్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర గ్రంథాలయ ముఖ్య కార్యదర్శి వెంకటేశం ఉత్తర్వులిచ్చారు. అధ్యక్షుడి నియామకం పట్ల నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎంవీఎస్ కళాశాలకు మహర్దశ

రూ.10కోట్లతో త్వరలో పీజీ విద్యార్థినుల వసతిగృహం నిర్మాణం

న్యూస్‌టుడే, పాలమూరు : ఉమ్మడి జిల్లాకే కీలకమైన మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలకు మహర్దశ రానుంది. ఇక్కడి పీజీ విద్యార్థినుల కోసం పీఎం ఉష పథకం కింద రూ.10 కోట్ల నిధులతో బాలికల వసతి గృహం మంజూరైంది. కళాశాలలో 3,910 మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎంవీఎస్ నాలుగో స్థానంలో ఉంది. అందుకే రాష్ట్రంలో ములుగు కళాశాలతో ఎంవీఎస్‌కు పీజీ బాలికల వసతిగృహం మంజూరు చేశారు. దీన్ని కళాశాల ప్రాంగణంలో ఇప్పటికే ఉన్న బాలికల వసతి గృహం పక్కనే రెండు అంతస్తులతో విశాలంగా, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా నిర్మించనున్నారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కావడంతో దసరా తర్వాత పనులను చేపట్టనున్నారు. ఈ భవన నిర్మాణానికి కేంద్రం రూ.6కోట్లు కేటాయించగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.4కోట్లను మంజూరు చేసింది.

ఉద్యోగార్థులకు కూడా వసతి : ఎంవీఎస్ కళాశాలలో ఇప్పటికే ఉన్న వసతిగృహంలో డిగ్రీ, పీజీ విద్యార్థినులు ఉంటున్నా అది ఏమాత్రం సరిపోవటం లేదు. కళాశాలలో ఉన్న ఏడు పీజీ కోర్సులను 500ల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొత్త వసతిగృహం నిర్మిస్తే దాన్ని పీజీ విద్యార్థినులకే కేటాయిస్తారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ తీసుకుంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మహిళలు, విద్యార్థినులకు కూడా ఎలాంటి రుసుము లేకుండా వసతి, భోజనం కల్పిస్తారు. 250 మంది ఉండే నిర్మించే ఈ వసతి గృహంలో ప్రత్యేక గ్రంథాలయం ఏర్పాటు చేసి పోటీ పరీక్షల పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచుతారు. వసతి గృహం ముందు చిన్న ఉద్యానం కూడా ఏర్పాటు చేస్తారు.

100 గదుల ప్రణాళికకు పచ్చజెండా : కళాశాలలో ఏటా కొత్త కోర్సులు మంజూరవుతున్నాయి. విద్యార్థుల సంఖ్య కూడా ఏటికేడు పెరుగుతోంది. ఇప్పటికే ఉన్న తరగతి గదులు శిథిలావస్థకు చేరాయి. ఈ నేపథ్యంలో రూ.70 కోట్ల వ్యయంతో రెండస్థుల్లో 100 తరగతి గదులను నిర్మించడానికి రూపొందించిన బృహత్తర ప్రణాళికకు ప్రభుత్వం నుంచి పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. దాతలు, పూర్వ విద్యార్థుల అందించే విరాళాలతో వీటిని నిర్మించాలని కళాశాల యాజమాన్యం యోచిస్తోంది.




అన్ని రంగాల్లో ముందుంచుతాం.. : ఎంవీఎస్ కళాశాలలోనే నేను చదివాను. ఇప్పుడు ఆ ప్రిన్సిపల్‌గా పనిచేయటం గొప్ప అనుభూతి. కళాశాల అభివృద్ధికి నా నెల వేతనంలో సగం ఇస్తాను. నాతో పాటు చాలా మంది సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు. అందరి సౌజన్యంతో కళాశాలను అభివృద్ధి చేసి విద్యార్థులకు అన్ని రకాల వసతులన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. పీఎం ఉష కింద మంజూరైన వసతిగృహం నిర్మాణ పనులు టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీకి ప్రభుత్వం అప్పగించింది.
- కె.పద్మావతి, ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

బస్టాండులో నాలా తొలగింపునకు అడుగులు


- 'ఈనాడు' వరుస కథనాలతో కదలిక
- రూ.2 కోట్ల అంచనాతో ఈఎన్‌సీకి ప్రతిపాదనలు


ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం మీదుగా ప్రవహిస్తున్న పెద్ద చెరువు నాలా

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని బస్టాండులో ప్రయాణికులకు దుర్గంధం వెదజల్లుతూ, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రాణ సంకటంగా పరిణమించిన పెద్దచెరువు మురుగు నాలా తొలగింపునకు అడుగులు పడుతున్నాయి. ఈ మురుగు నాలాపై 'ఈనాడు'లో వరుస కథనాలు ఇస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, డీఎం సుజాత ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, డిపో ఉద్యోగులు అనారోగ్యాల బారినపడుతున్న వైనాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన మురుగు కాల్వ దారి మళ్లించే విషయమై పురపాలక ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనతో ఇటీవల పురపాలక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ప్రయాణ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న పెద్దచెరువు నాలా దుస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆ తర్వాత పురపాలక ఈఈ బస్వరాజ్, వారి ఇంజినీరింగ్ బృందంతో ఆర్టీసీ ప్రాంగణం గుండా ప్రవహిస్తున్న నాలాను పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్, పీర్లబావి వైపు డిపో వెనక ప్రదేశాన్ని కూడా పరిశీలించి నాలాను ఎక్కడి నుంచి ఎలా దారి మళ్లించాలో ఒక అంచనాకు వచ్చారు. అంబేడ్కర్‌నగర్ సామాజిక భవనం వద్ద బస్టాండు వైపు పెద్దచెరువు నాలా దారి మళ్లిన విషయం తెలిసిందే. నాలా మొత్తం బస్టాండు ఆవరణ గుండా వెళ్లకుండా చర్యలు చేపడతారు. బస్టాండు ప్రహరీ లోపల 3 మీటర్ల విస్తీర్ణంతో 2 మీటర్ల లోతుతో డిపో ప్రహరీ వెనక భాగం గుండా పీర్లబావి వైపు దారి మళ్లిస్తారు. ఇలా 300 మీటర్ల వరకు నాలాను పొడిగిస్తూ పెద్దచెరువు వరకు నిర్మిస్తారు. ఈ పనుల కోసం రూ.2కోట్ల నిధులు అవసరమని ఈఈ బస్వరాజ్ అంచనా వేశారు. ఈ నివేదికను గత నెల రెండో వారంలో అటు ప్రజారోగ్యశాఖ ఈఎన్‌సీకి, ఇటు సీడీఎంఏకు పంపించారు. నిధులు మంజూరైన వెంటనే బస్టాండు గుండా ప్రవహిస్తున్న నాలాను దారి మళ్లించే పనులు చేపడతామని ఈఈ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.


డిపో ప్రహరీ పక్క నుంచి పెద్దచెరువు వైపు నాలా పొడిగిస్తూ నిర్మించాల్సిన ప్రదేశం

వెయ్యి టీఎంసీలకు చేరువలో..


జూరాల ప్రాజెక్టు వద్ద వరద (పాతచిత్రం)

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు గత 16 ఏళ్ల వ్యవధిలో వచ్చిన వరదను పరిశీలిస్తే ఇప్పటి మూడు సార్లు మాత్రమే వెయ్యిటీఎంసీలు దాటింది. ఈ ఏడాది మరో నాలుగైదు రోజుల్లో నాలుగోసారి వరద వెయ్యి టీఎంసీలు దాటనుంది. జులై 19 తేదీ ప్రాజెక్టుకు వరద మొదలైంది. ఆగస్టు చివరి వారంలో అత్యధికంగా 3.89 లక్షల క్యూసెక్కులు నమోదైంది. 75 రోజుల వ్యవధిలో జూరాలకు 950.70 టీఎంసీల వరద చేరింది. మంగళవారం జూరాలకు 95వేల క్యూసెక్కుల వరద కొనసాగుతోంది.

ఏడాది	వరద (టీఎంసీల్లో)
2015-16	45
2016-17	378
2017-18	315
2018-19	1460
2019-20	1425
2020-21	866
2021-22	820
2022-23	1236
2023-24	155
2024-	950

(అక్టోబర్ 1 తేదీ వరకు)

చోరీల నియంత్రణకు పకడ్బందీ చర్యలు : ఎస్పీ


పెబ్బేరు ఠాణాలో సేకరించిన వివరాలను నమోదు చేస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

పెబ్బేరు, న్యూస్‌టుడే: పెబ్బేరులో వరుసగా జరుగుతున్న చోరీల నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్పీ రావుల గిరిధర్ ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిని ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన పెబ్బేరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి ప్రధానమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయించాలన్నారు. చోరీలను అరికట్టేందుకు జాతీయ, స్థానిక రహదారులపై వాహనాలను తనిఖీలు చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నమోదైన కేసుల వివరాలను సీసీ టీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు పొందుపర్చాలన్నారు. అరెస్టులు, ఛార్జిషీట్లు, సమన్లు, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. జూదం, అక్రమ మద్యం రవాణా పై ముందస్తు సమాచారం సేకరించి అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం వివిధ కేసులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, కొత్తకోట సీఐ రాంబాబు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లు అడ్డుకున్న ఏచూరి

సంస్మరణ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ మధు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అప్పట్లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన ప్రభుత్వ రంగ సంస్థ ఎల్ఐసీ ప్రైవేటీకరణ బిల్లును సీతారాం ఏచూరి అడ్డుకున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మధు అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణం అంబేడ్కర్ కళాభవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు అధ్యక్షతన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఏచూరికి శ్రద్ధాంజలి ఘటించారు. ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ మధు ప్రసంగిస్తూ ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో బీమా ప్రైవేటీకరణ బిల్లును ప్రవేశపెడితే తన వాదనతో వెనక్కి పంపేలా చేశారని పేర్కొన్నారు. ఏచూరి ఎంపీగా పార్లమెంటులో గళమెత్తారని, బయట ప్రజా సమస్యలపై పోరాడి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. ఆయన మరణం వామపక్ష పార్టీలకు, దేశాభివృద్ధికి తీరని లోటన్నారు. ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినా కూడా కేంద్ర ప్రభుత్వం ఇక్కడ పెట్రో, డీజిల్ ధరలు తగ్గించకపోవడం దారుణమన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలను నేరుగా భర్తీ చేసే రిజర్వేషన్లను తొలగించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని విమర్శించారు. లౌకికవాద భారతదేశంలో ఒక దేశం, ఒకే ఓటు పేరుతో జమిలి ఎన్నికలు తేవాలన్న ప్రధాని మోదీ ఆలోచన సఫలీకృతం కాదన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ సీతారాం ఏచూరి మహాజ్ఞాని అని కొనియాడారు. ఏచూరితో పాటు ఓ వేదిక పంచుకున్నానని, ఈ సందర్భంగా ఆయన భారత తత్వశాస్త్రంపై అనర్గళంగా మాట్లాడారని గుర్తు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఏచూరి మృతి కమ్యూనిస్టు పార్టీలకు తీరనిలోటన్నారు. సభలో పురపాలక సంఘం ఆనంద్ కుమార్ గౌడ్, జేపీఎన్‌సీఈ ఛైర్మన్ కేఎస్ రవికుమార్, సీపీఐ సీనియర్ నాయకుడు కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బాలకిషన్, నాయకులు రాంచందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్, పద్మ, కురుమూర్తి, చంద్రకాంత్, నాయకులు మోహన్, ప్రశాంత్, నందు, భరత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

408.108 మిలియన్ యూనిట్లకు చేరిన జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు వద్ద జల విద్యుత్తు ఉత్పత్తి కొనసాగుతోంది. ప్రాజెక్టుకు 94,500 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా జల విద్యుత్తు ఉత్పత్తికి 35,153 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 4.158, దిగువన 4,497 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధ్యపడింది. ప్రస్తుత వర్షాకాలం మొత్తం విద్యుత్తు ఉత్పత్తి ఎగువన 216.874, దిగువన 191.234 మిలియన్ యూనిట్లకు చేరిందని జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

బాపూ మాట.. బంగారు బాట



• అమలు చేస్తే ప్రగతి పరుగులు
• నేడు గాంధీ జయంతి

న్యూస్‌టుడే- అచ్చంపేట, కోస్గి

జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని బుధవారం దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఆయన మాటలు సమాజ హితానికి బంగారు బాటలు వేశాయి. శాంతి, అహింస సిద్ధాంతాలను నమ్మిన మహాత్ముడు వాటితోనే పోరాటం చేశారు. గాంధీజీ అహింస, మద్యపాన నిషేధం, అంటరానితనం నిర్మూల, గ్రామ స్వరాజ్యం, నిజాయతీ, మత సామరస్యం వంటి సిద్ధాంతాలను ప్రపంచానికి చాటి చెప్పారు.

ఆదర్శం.. అనుసరణీయం

మహాత్ముడు మంచి మార్గం ఎప్పుడూ అనుసరణీయం అన్నారు.

★ **పాలమూరులో ఇలా:** నారాయణపేట జిల్లా ఎక్లాస్‌పూర్‌లో గత 15 ఏళ్లగా మద్య నిషేధం అమలు చేస్తున్నారు. మాతా మాణికేశ్వరి అహింస, మద్యపాన నిషేధం, శాంతిని భక్తులకు ప్రబోధించేవారు. ఆమె భక్తులు ఇప్పటికీ అనుసరిస్తున్నారు. అచ్చంపేట సమీపంలోని బక్కలింగాయపల్లిలో కూడా సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ గ్రామంలో అత్యధికులు గిరిజనులు ఉండటం విశేషం.

అంటరానితనం అమానుషం

అంటరానితనం అమానుషం. సృష్టిలో అందరూ సమానం. వివక్ష కూడదు.

★ ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదు. కృష్ణా మండలం ముడుమాల్‌లో ఇటీవల దళితులు వెళ్లి అడ్డుకున్నారని ఆలయ పూజారిని విధుల నుంచి తొలగించారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పౌర హక్కుల్ని నిర్వహిస్తూ అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నారు.

సత్యమేవ జయతే!



మహాత్ముడు నిజాయతీకి మారుపేరుగా నిలిచారు. చేసిన తప్పులను గుర్తించి సరి చేసుకోవడానికి ప్రాధాన్యం ఇచ్చారు.

★ ఉమ్మడి జిల్లాలో ఎన్నో సమస్యలు ఏళ్ల తరబడిగా ఎన్నికల వాగ్దానాలుగా ఉపయోగపడుతున్నాయి. ఎన్నికలు వచ్చినప్పుడల్లా హామీ ఇవ్వడం పరిపాటిగా మారింది. గెలిచిన తరువాత ఎవరూ వాటిని పట్టించుకోవడం లేదు.

అహింసతోనే విజయం



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (పాత)

అహింసతోనే విజయాన్ని సాధించవచ్చని మహాత్ముడు ప్రబోధించారు. భారతదేశాన్ని సుమారు వందల ఏళ్లపాటు పాలించిన ఆంగ్లేయుల బారి నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు అహింసా మార్గాన్ని ఎంచుకున్నారు.

★ ఎన్నికల సమయంలో గతంలో హింస చెలరేగి రక్తపాతం చోటు చేసుకునేది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత ఏడాది జరిగిన అసెంబ్లీ, ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి హింసకు తావు లేకుండా ఎన్నికల సంఘం బాపూజీ ఆశయాలను అమలు చేసి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంలో సఫలీకృతమైంది.

మద్య నిషేధంతోనే అభివృద్ధి



మహాత్ముడు మద్యపాన నిషేధంతోనే ప్రగతి సాధ్యమవుతుందని చాటి చెప్పారు. మద్యంతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. గాంధీజీ బాటలో నడవాలని పాలకులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

★ మద్యం ఉమ్మడి జిల్లాలో ఏరులై పారుతోంది. తిమ్మాజీపేట టీజీబీసీఎల్ నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 153 మద్యం దుకాణాలు, 23 బార్లు ఉన్నాయి. నెలకు రూ. 150 కోట్ల విలువైన అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రత్యేక ఉత్సవాలు, పండగలు, ఎన్నికల సమయంలో అదనంగా మరో రూ. 50 కోట్ల విలువైన మద్యం అమ్ముడవుతోంది. నెలకు 2.09 లక్షల కేసుల మద్యం, 2.51 లక్షల కేసుల బీర్లు అమ్ముడవుతున్నాయి. తాగుడుకు బానిసలై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండటంతో కుటుంబాలు వీధిన పడుతున్నాయి.

సంపూర్ణ పారిశుద్ధ్యం



మహాత్ముడు సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కేవలం 32.7 శాతం గ్రామీణ గృహాలకు మాత్రమే వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నట్లు తేలింది.

★ ప్రధాని మోదీ సంసద్ ఆదర్శ్ గ్రామ యోజనలో భాగంగా 2014 అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రారంభించారు. గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని ప్రతి ఎంపీ తన పరిధిలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రారంభంలో కొంత హడావిడి కనిపించినా పూర్తి స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో ప్రస్తుతం 72 శాతం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్నారు.



★ అచ్చంపేట మండలం బక్కలింగాయపల్లిలో వెయ్యి జనాభా ఉంది. తొలిసారి సర్పంచిగా ఎన్నికైన లక్ష్మీబాలునాయక్ కుమారుడు నవీన్‌కుమార్ ఎక్సైజ్ డీఎస్పీగా ఉన్న సమయంలో అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ శ్రీదేవి సహకారంతో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. నాటుసారా బట్టీలు ధ్వంసం చేసి ప్రజల ఆలోచనలో మార్పుతీసుకొచ్చారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, వ్యక్తిగత మరుగుదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. శుద్ధజల కేంద్రంతో అందరికీ నీరందిస్తున్నారు. ఊళ్లో మూడు వేల మొక్కలు నాటి ప్రతి మొక్క సంరక్షణకు ట్రీగార్డును ఏర్పాటు చేయించారు. 7 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి చక్కగా నిర్వహిస్తున్నారు.



మహబూబ్‌నగర్ : ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు, అధ్యాపకులు

చిత్తూ చిత్తుల బొమ్మ..
శివుడి ముద్దుల గుమ్మ..

'చిత్తూచిత్తూల బొమ్మ... శివుడీ ముద్దుల గుమ్మ... బంగారు బొమ్మ దొరికేనమ్మో ఈ వాడలోనా'.. వంటి బతుకమ్మ పాటలతో ఊరూవాడా నాట్యమాడుతోంది. తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ సంబరాలకు జిల్లా సన్నద్ధమైంది. దసరా సెలవుల కారణంగా విద్యాలయాల్లో కాస్త ముందే బతుకమ్మల సంబరాలు చేస్తున్నారు. ఉమ్మడి పాలమూరులో కొన్ని స్కూళ్లు, కళాశాలల్లో సందడి చూద్దామా.. **- న్యూస్‌టుడే, బృందం**



దేవరకద్ర: చౌదర్‌పల్లి వద్ద కళాశాలలో నిర్వహించిన వేడుకలో విద్యార్థులు, అధ్యాపకులు



ఉండవల్లి: అలంపూర్‌చౌరస్తాలో..



వెల్దండ: కొత్తతాండ సమీపంలో ఓ పాఠశాలలో..



పేట డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే పర్ణిక



అచ్చంపేట: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

చదువులకు విరామం.. ఇళ్లకు పయనం







1. సొంత గ్రామాలకు వెళ్తున్న విద్యార్థులు 2. సీటు కోసం సర్కస్ ఫీట్లు 3.బస్సులో స్థలం లేక ఫుట్‌బోర్డుపై ప్రయాణం

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థుల చదువులకు కొన్ని రోజులు విరామం లభించింది. బుధవారం నుంచి సెలవులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు వసతిగృహాల్లో ఉంటూ చదువుకుంటున్న వారు మంగళవారం ఇళ్ల బాటపట్టారు. ఈ నేపథ్యంలో గద్వాల ఆర్టీసీ బస్టాండ్‌లో కన్పించిన చిత్రాలే ఇవి.

కల్వకుర్తి పురపాలికకు స్వచ్ఛతా గుర్తింపు

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం కల్వకుర్తి పురపాలికకు అవార్డు ప్రకటించింది. గత నెల 17నుంచి నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడంతో పుర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులను ప్రభుత్వం అభినందించింది. తడి పొడి చెత్తను వేరుచేసి తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు డీఆర్సీ సెంటర్‌ను నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు, పురకమిషనర్‌కు అవార్డు అందించనున్నారు. ఈ మేరకు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి కార్యాలయం నుంచి పుర కమిషనర్‌కు సమాచారం అందించారు. బుధవారం దిల్లీలో జరిగే స్వచ్ఛభారత్ దివాస్ కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. కమిషనర్ మహమూద్ షేక్, ఎస్‌హెచ్‌జీ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, సభ్యులు దిల్లీకి బయలుదేరారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం 2017లో కర్నూలుకు చెందిన విజయానంద్ ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి కేసు విషయాలను పరిశీలించి సాక్ష్యులతో విచారణ చేసి మంగళవారం తన తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పీపీ పరందాములు, ఏపీపీ బాలస్వామి, అప్పటి సీఐ రామకృష్ణ, ఎస్సైలు గడ్డం కాశీ, విజయ్‌కుమార్, సీఐ గాంధీనాయక్, ఏఎస్సై బాలకృష్ణ, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డిలను ఎస్పీ డి.జానకి అభినందించారు.

రాగి జావ ఇచ్చేదెలా?



'మింగ మెతుకులేదు.. మీసాలకు సంపెంగ నూనె' అన్న నానుడి సోమవారం కరీంనగర్ జిల్లా మానకొండూరులో పోషణ జాతర సందర్భంగా మంత్రి సీతక్క చేసిన ప్రకటన చూస్తే గుర్తుకొస్తోంది. అంగన్వాడీల్లో గర్భిణులు, చిన్నారులకు అదనంగా రాగిజావ ఇస్తామని మంత్రి చెప్పారు. ఇప్పుడు ఇస్తున్న నిధులే ప్రభుత్వం చెబుతున్న లక్ష్యాలకు ఏమాత్రం సరిపోని పరిస్థితుల్లో రాగిజావ ఎలా అందజేస్తారన్నది ప్రశ్న.

న్యూస్‌టుడే- నారాయణపేట న్యూటౌన్



ప్రస్తుతం ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం కోసం రోజుకు ఒక్కొక్కరికీ 70 పైసలు అందజేస్తోంది. బాలింతలు, గర్భిణులు ఒక్కొక్కరికీ రూ.1.50 చొప్పున ఇస్తోంది. ధన్వాడలో ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని తీసుకుంటే ఇక్కడ మొత్తం పది మంది పిల్లలు ఉన్నారు. వీరికి అదనంగా ఏడుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలు ఉన్నారు. వీరందరికీ రోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని వండి అందించాల్సి ఉంది. ఈ లెక్కన పది మంది పిల్లలకు రోజుకు రూ.7, బాలింతలు గర్భిణులకు రూ. 15 ప్రభుత్వం అందజేస్తోంది. ఈ రెండింటినీ కలిపితే మొత్తం రూ. 22 ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలను పరిగణలోకి తీసుకుంటే రూ.22కు పావుకిలో కూరగాయలూ రావు. వీటితో 20 మందికి పౌష్టికాహారం వండి పెట్టాలంటే ఎలా సాధ్యమో ప్రభుత్వానికే తెలియాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు 'కొన్నది వంకాయ.. కొసిరింది గుమ్మడి కాయ" చందాన్ని తలపిస్తున్నాయి.

● ఏదైనా ప్రభుత్వ కార్యాక్రమాలు జరిగినప్పుడు అంగన్వాడీ కార్యాకర్తలు, ఆయాలనే ముందు పెడుతుంటారు. కొన్ని సందర్భాల్లో కొంతమందికి అదనంగా వండి వడ్డించాల్సి వస్తోంది. ఇది మరికొంత అదనపు భారం. కొంతమంది అంగన్వాడీ కార్యకర్తలు నిబద్ధతతో ఉన్నంతలో మంచి ఆహారం అందించడానికి ప్రయత్నిస్తుండగా, కొన్నిచోట్ల పై నుంచి కింది స్థాయి వరకు చేతులు తడుపుతూ హాజరులో నమోదులో మతలబు చేసి పిల్లల కడుపు కొడుతున్నారు.

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో 5,548 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో సుమారుగా 2.80 లక్షల పిల్లలు, 40వేల దాకా బాలింతలు, గర్భిణులు ఉన్నారు. వీరందరికీ ప్రతిరోజూ మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందించాలి. కూరగాయల కోసం ఇస్తున్న నిధులు చాలకపోవడంతో నిర్వాహకులు ఏ కూరగాయ తక్కువ ఉందో దాన్నే కొనుగోలు చేసి వడ్డిస్తున్నారు. మాటి మాటికీ వీటినే పెడుతుండటంతో పౌష్టికాహారం అనే మాటకే విలువే లేకుండా పోతోంది. కొన్ని కేంద్రాల్లో తక్కువ ధరకు వస్తాయని బజార్లలో రెండోరకం సరకు కొంటున్న సందర్భాలూ ఉంటున్నాయి. అధికారులు తనిఖీలకు వస్తున్నారని తెలిస్తే మాత్రం కొంత మెరుగ్గా భోజనం ఉంటుంది.

గతంలో వంట గ్యాస్ కోసం ఒక్కొక్క విద్యార్థికీ రోజుకు రెండు పైసలు, బాలింతలు, గర్భిణులకు మూడు పైసలు చొప్పున ఇచ్చేవారు. కొన్ని సంవత్సరాలుగా వీటిని నిలిపేశారు. ప్రస్తుతం సిలిండర్ నిధులను నిర్వాహకులే భరించాల్సి వస్తోంది. గత ఏడాది ఉనుంచి పోపు దినుసుల ప్యాకెట్లను అందజేస్తున్నా, అరకొరగా ఉండటంతో ఏ మాత్రం సరిపోవడంలేదని నిర్వాహకులు వాపోతున్నారు. మళ్లీ బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కూరగాయలకు ఇస్తున్న నిధులు మరీ తక్కువ ఉండటాన్ని గుర్తించకుండా నాణ్యమైన పౌష్టికాహారాన్ని వడ్డించాలని కోరుతుండటం విస్మయాన్ని కలిగిస్తోంది. నిధులు పెంచితే రాగిజావ అందించడం పెద్ద కష్టం కాబోదని అంగన్వాడీ కార్యకర్తలు అంటున్నారు.

ప్రాణం తీసిన అరతులం బంగారం

తోడుగా ఉన్నవాడే నిందితుడు • వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఒంటరితనానికి ఒక తోడు దొరికిందనుకుంది ఆ మహిళ.. కానీ ఆ తోడే అర తులం బంగారం కోసం తన ప్రాణాలు తీస్తుందని ఊహించలేకపోయింది. షాద్‌నగర్‌లోని శ్రీనివాసకాలనీలో ఇటీవల కవర్‌లో దొరికిన మహిళ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. మంగళవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్‌లు కేసు వివరాలు వెల్లడించారు. చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన ఒంటరి మహిళ భాగ్యలక్ష్మి(40) కొన్నేళ్లుగా ఫరూక్‌నగర్‌లోని అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవించేది. గద్వాల జిల్లా చాగాపూర్‌కు చెందిన వడ్డె రమేష్ తాపీ మేస్త్రీ. వ్యసనాలకు బానిసైన ఇతన్ని భార్యాపిల్లలు వదిలేయడంతో 8 నెలల క్రితం షాద్‌నగర్ వచ్చాడు. ఒకేచోట కూలిపనులు చేసే వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఒంటరిగా ఉన్న తనకు ఓ తోడు దొరికిందనే సంతోషంతో ఆమె అడిగినప్పుడల్లా అతడికి డబ్బులు ఇచ్చేది. ఆమె చెవులకున్న అర తులం బంగారు కమ్మలమీద కన్నేశాడు. ఈ క్రమంలోనే గత నెల 27న ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. చెవికమ్మలతో పాటు ఇంట్లో ఉన్న రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ దొంగిలించి మృతదేహాన్ని కవర్‌లో చుట్టి శ్రీనివాసకాలనీలో పారేశాడు. సీఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ సీఐ ప్రశాంత్, ఎస్సైలు శరత్, సుశీల, శంకర్, సిబ్బంది జోత్స్న, నరేందర్‌లు బృందంగా ఏర్పడి మూడు రోజుల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా కేసును వేగంగా పరిష్కరించిన పోలీసులకు ఏసీపీ నగదు రివార్డులు అందజేశారు.

అలంపూర్‌లో వైభవంగా ఉత్సవాలు : కలెక్టర్



అలంపూర్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

గద్వాల కలెక్టరేట్, ఉండవల్లి, న్యూస్‌టుడే: జోగులాంబ అమ్మవారి సన్నిధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్లో దసరా ఉత్సవాలపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3 నుంచి 12 వరకు నిర్వహించే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు, ఆరోగ్య, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండాలని, ఉత్సవాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడిపించాలన్నారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు లేకుండా ఆ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు, దేవాలయం చేరుకునే మార్గంలో రోడ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఆర్డీవో రాంచందర్, ఈవో పురేందర్, అధికారులు పాల్గొన్నారు.

● అలంపూర్‌చౌరస్తా, డి.బూడిదపాడు, భైరాపురం కూడలిలో ప్రవేశద్వారాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల వివరాలను ప్రవేశద్వారంపై పొందుపరిచారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

మానవపాడు, న్యూస్‌టుడే: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి అందరి సమన్వయ సహకారంతో తన వంతు కృషి చేస్తామని డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బాధ్యతలు స్వీకరించాక.. తొలిసారిగా మానవపాడు సహకార సంఘం కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. కలుకుంట్ల గ్రామానికి చెందిన ఓ రైతుకు రుణమాఫీ కాకపోవడంతో సొసైటీ అధికారులను నిలదీశారు. డీసీసీబీ డైరెక్టర్ రంగారెడ్డి, సొసైటీ ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అయ్యన్న, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఈనాడు

శ్రీనివాస్: దేవర, వెంకటేశ్వర: సత్యం సుందరం
—న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

3 నుంచి దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు



కన్యకాపరమేశ్వరి అమ్మవారు

కొత్తకోట, న్యూస్‌టుడే: కొత్తకోట పట్టణంలోని కన్యకపరమేశ్వరి, అంబాభవాని శంకర ఆలయం, కోటి లింగేశ్వర, భక్త మార్కండేయ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీలు తెలిపాయి. గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణల్లో అమ్మవారిని అలంకరించి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో తొలిరోజు బాల త్రిపుర సుందరి అలంకరణ, 4న గాయత్రీ దేవి అలంకరణ, 5న అన్నపూర్ణాదేవి, 6న మహాలక్ష్మీ దేవి, 7న మహాగౌరి, 8న లలితాదేవి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దని, 12న రాజరాజేశ్వరీదేవి అలంకరణ ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ప్రత్యేక కార్యక్రమాలు మొదలవుతాయని 11 గంటలకు కుంకుమార్చనలు, 1 గంటకు మహాహారతి, అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

భక్తాంజనేయస్వామి నిజరూప దర్శనం



నిజరూప దర్శనంలో భక్తాంజనేయస్వామి

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో కొన్నేళ్లుగా సింధూరంతో దర్శనమిస్తున్న మిట్ట భక్తాంజనేయస్వామి రెండు రోజులుగా సింధూరం లేకుండా నిజరూప దర్శనం ఇస్తుండటంతో మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాద నైవేద్యాలు స్వీకరించారని ఆలయ అర్చకులు నవీన్‌చార్యులు తెలిపారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

అమరచింత, న్యూస్‌టుడే: ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్ల ఉపాధి దూరమయ్యిందని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌.ఎన్‌.రమేశ్‌, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌.అజయ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం పట్టణంలో 'ఆటో డ్రైవర్స్‌ ఓనర్స్‌ యూనియన్‌' నూతన కార్యవర్గం సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఇవ్వాలి, ఉచితంగా డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఇప్పించి ఆటో బీమా కూడా ప్రభుత్వమే చెల్లించాలన్నారు. అధ్యక్షుడిగా ఏబీ.నిస్సార్‌, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శి ఎస్‌.రఘు, సహాయ కార్యదర్శిగా రమేశ్‌, కోశాధికారిగా వెంకి, సభ్యులుగా నాగరాజు, వినోద్‌, కథల్‌, రాజు ఎన్నికయ్యారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

వనపర్తి పట్టణం: వనపర్తి జిల్లా పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా మేరెడ్డి బౌద్ధరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సూర చంద్రశేఖర్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను రాష్ట్ర నాయకులు అభినందించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై కళా ప్రదర్శన

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు సమాచార, పౌర సరఫరాల శాఖ అధికారి పి. సీతారాం నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళా బృందం మండలంలోని ఏటిగడ్డ శాఖాపూర్ గ్రామంలో మంగళవారం కళా ప్రదర్శన నిర్వహించింది. బాల్య వివాహాల నిర్మూలన, పరిసరాల శుభ్రత, కాలానుగుణ వ్యాధుల పట్ల జాగ్రత్తలు, స్వచ్ఛభారత్ వంటి పలు అంశాలతో కళాకారులు తమ యొక్క ఆటపాటలతో ప్రజలను చైతన్య పరచడం జరిగింది. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి రోజా, గ్రామ కార్యదర్శి నవీన్‌కుమార్, కళా బృందం నాయకుడు గుడిసె శివలింగం, కళాకారులు డప్పు నరసింహ, సువర్ణ, రాధ, శ్రీనివాస్, కృష్ణయ్య, బోనాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సురేందర్ మంగళవారం తెలిపారు. సోమవారం జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో జిల్లాకు చెందిన బాల బాలికలు ఎంపిక కావడం పట్ల జిల్లా యువజన, క్రీడలశాఖాధికారి సుధీర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేసి క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపతి, సుజాత, విజయ్‌కుమార్, తైక్వాండో శిక్షకులు వెంకటేశ్, మహేశ్ పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు..



శ్రావ్య, శ్రీనిజ

మదనాపురం, న్యూస్‌టుడే: మండలంలోని దుప్పల్లిలో భారతి టాలెంట్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు తెలంగాణ క్రీడా పాఠశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజామైనొద్దీన్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో గ్రామానికి చెందిన విద్యార్థినులు శ్రావ్య, శ్రీనిజ ప్రతిభ కనబరిచి హకీంపేట క్రీడా పాఠశాలలో సీట్లు దక్కించుకున్నారు. మంగళవారం విద్యార్థినులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

విద్యుత్తు అంతరాయంపై తహసీల్దారుకు ఫిర్యాదు

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని ఏటిగడ్డ శాఖాపూర్‌లో విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా మారిందని, కరెంటు ఎప్పుడు వస్తుందో, పోతుందో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామానికి విద్యుత్తు కష్టాలు తీరాలంటే తోమాలపల్లి సబ్ స్టేషన్ త్వరగా ప్రారంభిస్తే ఏటిగడ్డ శాఖాపూర్‌తో పాటు తోమాలపల్లి, రామాపురం, రామమ్మపేట గ్రామాలకు విద్యుత్తు సమస్యలు తీరుతాయని మంగళవారం తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. వెంకటన్నగౌడ్, సందకేశవ్, పరమేష్ నాయి, గువ్వల గోపి, రాకేశ్ పాల్గొన్నారు.



అమరచింత : జడ్పీ ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు



వీపనగండ్లలో బాలికల ఉన్నత పాఠశాలలో...



కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాల వద్ద బతుకమ్మతో ఉపాధ్యాయినులు



తెల్లరాళ్లపల్లిలో బతుకమ్మతో విద్యార్థులు

ఒక్కేసి పువ్వేసి సందమామ..



గోపాల్‌పేట బాలికోన్నత పాఠశాలలో ..

ఒక్కేసి పువ్వేసి సందమామ, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ విద్యార్థులు ఆడిపాడారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడుతూ పాడుతూ అలరించారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. —న్యూస్‌టుడే బృందం



ఖిల్లాఘనపురం: బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు



వనపర్తి: ప్రభుత్వ బాలికల జడ్పీ పాఠశాలలో ..



మదనాపురంలో..



అమరచింత : కేజీబీవీ విద్యాలయంలో..



శ్రీరంగాపురం: కంబాళాపురం ప్రాథమిక పాఠశాలలో...



ఆత్మకూరులో..

నిబంధనల ప్రకారం వివరాల సేకరణ: కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్లు సంచిత్‌గంగ్వార్, నగేశ్, జిల్లా అధికారులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఒకే కార్డు కార్యక్రమానికి జిల్లాలో నిబంధనల ప్రకారం వివరాల సేకరణ చేపడుతామని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఒక గుర్తింపు నంబరు ఇచ్చి కుటుంబ సభ్యులకు వ్యక్తిగత గుర్తింపు కార్డుతో జత చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 3న నుంచి 8 వరకు వివరాల సేకరణ పూర్తి చేసి 10 వరకు నివేదిక పంపించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్‌గంగ్వార్, నగేశ్, ఆర్డీవో పద్మావతి, రెవెన్యూ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా జిల్లా యంత్రాంగం

వనపర్తి న్యూటౌన్: వయోవృద్ధులకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. మంగళవారం ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా సంక్షేమాధికారిణి లక్ష్మమ్మ, జడ్పీ సీఈవో యాదయ్య, డిప్యూటీ సీఈవో రామమహేశ్వర్‌రెడ్డి, ఎస్సీ అభివృద్ధి అధికారిణి సునీత పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

వనపర్తి న్యూటౌన్: శంకర సముద్రం రిజర్వాయర్‌లో ముంపు బాధితులకు పునరావాస కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో భూసేకరణ, రెవెన్యూ, నీటిపారుదల అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. పునరావాస కేంద్రంలో మౌలిక వసతులు, రహదారులు, కమ్యూనిటీ హాల్స్, ఆలయాలు, తాగునీరు, పాఠశాల తదితర ఏర్పాట్లకు అవసరమైన ప్రతిపాదనలు చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ మల్లయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మధుమేహ పరీక్షలు నిర్వహించండి

వనపర్తి న్యూటౌన్: 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి మధుమేహ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, నివారణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాయినాథ్‌రెడ్డి, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారులు రామచంద్రరావు, ప్రవళిక, మహేశ్ పాల్గొన్నారు.

వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి ఎంఆర్.సునిత

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వృద్ధుల నుంచి పిల్లలు ఆస్తి రాయించుకొని వారిని ఇంటి నుంచి బయటకు పంపించినా, వృద్ధాశ్రమంలో చేర్పించిన, వారి బాగోగులు చూడకపోయినా చట్టరీత్యా శిక్షార్హులని జిల్లా కోర్టు ప్రధానన్యాయమూర్తి ఎంఆర్.సునిత అన్నారు. వనపర్తిలో వృద్ధాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వృద్ధుల కొరకు న్యాయ సేవలందించే చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల కోసం ఎన్నో చట్టాలున్నాయన్నారు. వృద్ధులను పట్టించుకోవడం లేదని జిల్లా న్యాయశాఖ అధికార సంస్థ, ఆర్డీవోకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారి పిల్లలను కౌన్సెలింగ్ ఇచ్చి బాగోగులను చూడాలని హెచ్చరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో మహిళలకు ఉచితంగా పరీక్షలు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్‌ను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పని దినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 040-23551235, 23550967 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

టెలికాం బోర్డు సభ్యుడిగా శంకర్ ప్రసాద్

వనపర్తి న్యూటౌన్: సంగారెడ్డి టెలికాం బోర్డు సభ్యుడిగా వనపర్తి డీసీసీ మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూపార్టీ శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి కృషి వల్ల ఈ పదవి లభించిందన్నారు.

అవ్వా తాతలకు విద్యార్థుల పాదపూజ



యాపర్ల ఉన్నత పాఠశాలలో అవ్వలకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

పెబ్బేరు, న్యూస్‌టుడే: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని యాపర్ల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమక్షంలో అవ్వ, తాతలకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు అవ్వలు, తాతలను పాఠశాలకు తీసుకొచ్చి పాద పూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల జీహెచ్‌ఎం శంకర్ గౌడ్ మాట్లాడుతూ వృద్ధులను గౌరవించాలని వారు చెప్పే నీతి కథలు నేర్చుకొని పెద్దలు చెప్పిన మాటలు వినాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహినొద్దీన్, వెంకటేశ్వర్లు, ఈశ్వర్‌రెడ్డి, బాలమ్మ, శ్రీధర్, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ రామసుబ్బారావు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గ్రామాలతో పాటు పురపాలికల్లో శుద్ధ తాగునీటి సరఫరాకు క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యత వహించాలని మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ రామసుబ్బారావు పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆత్మకూరు, అమరచింత మండలాల పరిధిలోని గ్రామాల తాగునీటి సరఫరా సిబ్బందికి ఏర్పాటు చేసిన నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాగునీటిని పొదుపుగా వాడుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సుజాత, శ్రీనివాసులు, కమిషనర్ నాగరాజు, ఎంపీవోలు శ్రీరాంరెడ్డి, నర్సింహయ్య, మిషన్ భగీరథ ఏఈ రుకేందర్‌రెడ్డి, మాస్టర్ ట్రైనీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు ఎంపీడీవో కార్యాలయంలో నీటి నాణ్యతపై, చేతిపంపుల మరమ్మతు, క్లోరినేషన్, పైపుల లీకేజీలపై ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ అమీత్ మాట్లాడారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో గోవిందరావు, ఎంపీవో రఘురాములు, ఏఈ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండండి

పెబ్బేరు: అమ్మాయిలు సమాజంలో ఎదుర్కొనే అంశాలపై అవగాహన పెంచుకోవాలని, అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని షీ టీం ఎస్సై అంజాద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మాయిలకు ఇతర వ్యక్తుల నుంచి రకరకాల ఒత్తిళ్లు, ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మానసిక సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, ఒత్తిడి, భయం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంట్లో, బయట, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా షీటీంకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భద్రాసేన్, భరోసా, హెల్ప్‌లైన్ టీంల సభ్యులు శిరీష, అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు, డైరెక్టర్‌కు సన్మానం

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం పాలకమండలి నిర్వహిస్తున్న సమావేశాన్ని సందర్శించిన డీసీసీబీ అధ్యక్షుడు మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డిలను నూతన అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీసీసీబీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచనల మేరకు పెబ్బేరు, శ్రీరంగాపురం, చిన్నంబావి మండలాలకు అనుకూలంగా పట్టణంలో కొత్త డీసీసీ బ్యాంకు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాసులు గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్ సాగర్, డైరెక్టర్లు రామన్‌గౌడ్, రాములు, సురేందర్ గౌడ్, గౌని యుగంధర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ.. ఒకరి మృతి

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని రంగాపురం గ్రామ శివారులో లిక్కర్ కంపెనీ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన పాపయ్య(38) అలియాస్ శివశంకర్ యాదవ్ లిక్కర్ కంపెనీలో లారీ నిలిపి ద్విచక్ర వాహనంపై ఎర్రవల్లి వైపు వెళ్తుండగా రంగాపూర్ శివారులో జాతీయ రహదారి 44పై కర్నూలు వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో పాపయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే అంబులెన్స్‌లో మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌ఛార్జి ఎస్సై రామేశ్వర్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరుచోట్ల ఇద్దరి అదృశ్యం

కొత్తకోట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి(21) అదృశ్యంపై అదే గ్రామానికి చెందిన ఓ యువకుడి మీద అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం ...గత నెల 17న తన కుమార్తె కనిపించకుండా పోయిందని పలు చోట్ల ఆరా తీయగా యువకుడు అపహరించినట్లు తెలిసిందని ఇప్పటికీ ఆచూకీ తెలియడం లేదని వివరించారు. యువకుడిని విచారించి తన కుమార్తె ఆచూకీ తెలపాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అమరచింత: పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీకు చెందిన ఎస్.శ్రీధర్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై బి.సురేశ్ తెలిపారు. అమరచింత, ఆత్మకూరు మండలాల్లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్య రాత్రి బయటికి వెళ్లి మంగళవారం సాయంత్రం అయిన ఇంటికి రాలేదు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతు భవిష్యత్తుకు విత్తనమే కీలకం

పెద్దమందడి, (వనపర్తి న్యూటౌన్): ఆరుగాలం కష్టపడే రైతన్న భవిష్యత్తుకు విత్తనమే కీలకమని జిల్లా సీడ్స్ అధికారి ఆదినారాయణరెడ్డి అన్నారు. అల్వాల గ్రామంలో తెలంగాణ విత్తనాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో విత్తన ఎంపిక విధానంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీడ్స్ మేనేజర్ శేఖర్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ప్రయాణ ప్రాంగణం



విద్యార్థులతో వనపర్తి ప్రయాణ ప్రాంగణంలో రద్దీ

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో ప్రభుత్వం మంగళవారం నుంచి పాఠశాలలకు, కళాశాలలకు సెలవులు ప్రకటించింది. దీంతో పట్టణానికి విద్యనభ్యసించడానికి వచ్చి వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు సొంత ఊర్లకు వెళ్లేందుకు వనపర్తి ప్రయాణ ప్రాంగణానికి చేరుకోవడంతో బస్టాండ్ కిటకిటలాడింది. విద్యార్థుల కోసం వచ్చిన తల్లిదండ్రులు, పిల్లలతో ప్రయాణ ప్రాంగణం సందడిగా మారింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులు విద్యార్థులతో కిక్కిరిసిపోయాయి.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: యాప్‌ల ద్వారా రుణాలు మంజూరు చేస్తామని అమాయకుల్ని నమ్మించి డబ్బు వసూలు చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురిని వనపర్తి జిల్లా కొత్తకోట పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. సైబర్ క్రైం డీఎస్పీ ఎన్‌బీ రత్నం, సీఐ రాంబాబుతో కలిసి వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పిల్లిగుండుతండాకు చెందిన దినేశ్.. ఎర్రగుట్టతండాకు చెందిన చిట్కు రమేశ్ ద్వారా పశ్చిమబెంగాల్‌లో సైబర్ నేరాలు ఎలా చేయాలో శిక్షణ పొందాడు. అక్కడే కొన్ని రోజులు వారిచ్చిన జాబితాలో ఉన్న చరవాణులకు ఫోన్ చేసి రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని, దానికి రుసుము చెల్లించాల్సి ఉంటుందని నమ్మించి వారి దగ్గర నుంచి రూ.10-40 వేలు వసూలు చేసేవాడు. అక్కడి నుంచి తండాకు వచ్చిన దినేశ్ సైబర్ నేరాలకు ఎలా పాల్పడాలో ఆయన సోదరుడు నరేశ్, స్నేహితుడు విజయ్‌కి కూడా శిక్షణ ఇచ్చారు. కొత్తకోటకు చెందిన కుమ్మరి రాజు రుణానికి దరఖాస్తు చేసుకోగా జులైలో వీళ్లు ఆయనకు ఫోన్ చేసి రుణాన్ని మంజూరు చేసేందుకు ఛార్జీలు చెల్లించాలని చెప్పారు. రెండు విడతల్లో రూ.12,250 చెల్లించారు. మరో రూ.9 వేలు చెల్లించాలని చెప్పడంతో మోసపోయానని గుర్తించి వెంటనే కొత్తకోట ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు దినేశ్, నరేశ్, విజయ్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. వారి నుంచి ప్లాట్, భూమి పత్రాలు, 9 చరవాణులు, 5 సిమ్‌కార్డులు, రెండు కార్లు, ఒక బుల్లెట్ మొత్తం రూ.50 లక్షల విలువైన వాటిని జప్తు చేసినట్లు వివరించారు. కేసు దర్యాప్తులో ఎస్సై మంజునాథరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ కురమయ్య, కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌రెడ్డి చురుగ్గా వ్యవహరించారన్నారు. నిందితులను రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు ఈ కేసులో సంబంధం ఉన్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.



ఆత్మకూరు: పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న పురఛైర్‌పర్సన్ గాయత్రి

ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ పారిశుద్ధ్యం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రజలు భాగస్వాములైతేనే పట్టణంలో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధ్యపడుతుందని పుర ఛైర్‌పర్సన్ గాయత్రి పేర్కొన్నారు. మంగళవారం నాల్గో వార్డులో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో ఆమె పాల్గొన్ని మాట్లాడారు. వార్డులోని మురుగు కాల్వలను శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు ద్రావణం పిచకారీని పర్యవేక్షించారు. ఇళ్లలో నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్ మహేశ్వరి, మెప్మా సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కిట్లు అందజేత

పెబ్బేరు పట్టణం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పురపాలక కార్యాలయంలో మంగళవారం పుర కమిషనర్ ఆదిశేషు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు కిట్లను అందజేశారు. పుర అధ్యక్షురాలు కరుణశ్రీ మాట్లాడుతూ.. కార్మికులు పని చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, పని చేసిన తర్వాత సబ్బుతో చేతులను శుభ్రం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పుర ఉపాధ్యక్షుడు కర్రె స్వామి, కౌన్సిలర్లు పార్వతి, పద్మ, ఎల్లారెడ్డి, ప్రత్యేకాధికారి మీరాజ్ అహ్మద్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ యోగేష్ కుమార్ పాల్గొన్నారు.